అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థిని కాళేశ్వరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, నవంబర్ 23: అమ్మాయిలు అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని సిరిపుర ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కాళేశ్వరి మార్షల్ ఆర్ట్స్ ఉష్ క్రీడాపోటీల్లో జాతీయస్థాయికి ఎంపికకావడంతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్‌మాస్టర్ పోచయ్య, వీరేశం పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

జహీరాబాద్, నవంబర్ 23: జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జహీరాబాద్ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ కోరారు. శనివారం కోర్టు అవరణలో పోలీసు అధికారులు, న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డిసెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యే అన్ని కేసులకు పరిష్కారం లభిస్తుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు మానేన్న, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైల్ తనిఖీ

కంది, నవంబర్ 23: కందిలోని సెంట్రల్ జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి (సీనియర్ సివిల్ జడ్జి) రమేశ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైల్‌లోని బరాక్, గదులు, వంటశాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సమయానికి బెయిల్, ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. కేసుల పరిష్కారానికి న్యాయవాదులు లేని వారు తమకు అర్జీ పెట్టుకుంటే ఉచిత న్యాయ సేవలు పొందేందుకు న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నిజాంపేట్, నవంబర్ 23: మండల పరిధిలోని బల్కంచెల్క పంచాయతీ పరిధిలోని భక్తిధాం తండాలో విశ్వపాలిని భావానీ మాత, సమేత సంత్ సేవాలాల్ మహారాజ్ మహా మందిరం 12వ వార్షికోత్సవాల ముగింపు శనివారం మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి, ఆలయ ధర్మకర్త మూడ్ కిషన్-లలిత దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదానం చేశారు.

అనంత పద్మనాభ స్వామి ఆలయ చైర్మన్‌గా లక్ష్మయ్య

చౌటకూర్, నవంబర్ 23: మండలంలోని చక్రియాల లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయ కమిటీ శనివారం ఏర్పాటయింది. కమిటీ చైర్మన్‌గా భానూరి లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు ఆలయ కమిటీ డైరెక్టర్లుగా ఎ న్నికైన భానూరి లక్ష్మయ్య, రోళ్లపాటి సత్యనారాయణ, మన్నె నర్సింహులు, తిమ్మారెడ్డి గారి అంజిరెడ్డి, జంగిలి మల్లమ్మ, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఆలయ ప్రధాన అర్చకుడు మహారాజుల రామకృష్ణ శర్మతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు ప్రమాణ స్వీకారం చేయించారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి

జహీరాబాద్, నవంబర్ 23: పాడి పశువుల పెంపకంలో రైతులు, యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని న్యాల్‌కల్ మండల పశువైద్యాధికారి గణేశ్ సూచించారు. శనివారం మండలంలోని టేకూర్ గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ, పశు ఘనాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తుక్కారెడ్డి, పశు వైద్య సిబ్బంది కిషన్‌రావు, మాజీద్, గోపాల మిత్రలు జనార్దన్‌రెడ్డి, ధన్‌రాజ్, నాగప్ప పాల్గొన్నారు.

మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్-2 మాక్ టెస్టు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 23: తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రూప్-2 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ యువతీ యువకులకు టీఎస్‌పీఎస్సీ ద్వారా రెండు మాక్ టెస్టులు నిర్వహించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దేవుజ శనివారం ప్రకటనలో తెలిపారు. మైనార్టీ అభ్యర్థులు (ముస్లిం, క్రిష్టియన్, సిక్కు, జైనులు, బౌద్ధులు, పారసీకులు) ఈ నెల 29లోగా కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు అందించాలన్నారు. మొదటి మాక్ టెస్టు డిసెంబర్ 2, 3 తేదీలు, రెండో మాక్ టెస్టు 9, 10 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

జహీరాబాద్: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కొండాపూర్: చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్, నవంబర్ 23: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని తుంకుంట గ్రామానికి చెందిన ప్రేమల, మల్లెల్మకు చెందిన ఇస్మాయిల్, కాశింపూర్‌కు చెందిన సువర్ణ, డిడ్గికి చెందిన రాజరత్నం, హోతి(బి)కి చెందినే పద్మమ్మ, సత్వార్‌కు చెందిన అస్మాబేగం, మహమ్మద్ అలీ, అనేగుంటకు చెందిన గొల్ల తుల్జమ్మలకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.3.93 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, బీఆర్‌ఎస్ నాయకులు యాకుబ్, అమీత్‌కుమార్, హీరురాథోడ్, విజయ్‌రాథోడ్, అబ్రహం, ప్రేమ్, జగన్నాథం, పెంటారెడ్డి, సత్యం ముదిరాజ్, కిష్టయ్య, స్వామిదాస్, మోహన్, రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఝరాసంగం, నవంబర్ 23: ఝరాసంగం మండల పరిధిలోని కక్కరవాడ గ్రామంలో శనివారం మాజీ సర్పంచ్ జగదీశ్ సోదరుడు విఠల్ మరణించారు. విషయం తెలుసుకున్న జహీరాబద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, స్థానిక నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు సంగమేశ్వర్, కేతకి ఆలయ మాజీ చైర్మన్ నర్సింహ గౌడ్, నాయకులు ఎజాజ్ బాబా, నాగన్న, భోజిరెడ్డి, సయ్యద్, హన్మంత్‌రెడ్డి ఉన్నారు.

కొండాపూర్‌లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో..

కొండాపూర్, నవంబర్ 23: లబ్ధిదారులకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కొండాపూర్ మండలం, సంగారెడ్డికి చెందిన 53 మంది లబ్ధిదారులకు శనివారం రూ.17,68,500 లక్షల విలువచేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మావతి పాండరంగం, సర్పంచ్‌ల ఫోరం మడల మాజీ అధ్యక్షుడు రక్మోద్దీన్, నాయకులు జైపాల్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విఠల్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాణిక్య ప్రభు, ఆంనేయులు, మల్లాగౌడ్, మోహన్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

కంకోల్ గ్రామంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

మునిపల్లి, నవంబర్ 23: మండలంలోని మాలలంతా డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే సింహగర్జనకు మాలలంతా భారీగా తరలిరావాలని మాలమహానాడు జిల్లా కార్యదర్శి సురేశ్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని కంకోల్‌లో మాలల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలలంతా తమ హక్కులను కాపాడుకొని భవితరాలకు మంచి భవిష్యత్ అందించాలన్నారు. అనంతరం డిసెంబర్ 1న చలో హైద్రాబాద్ వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

సీఐ వినాయక్‌రెడ్డిని సత్కరిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

సీఐకి స్వాగతం పలికిన కార్పొరేటర్

పటాన్‌చెరు, నవంబర్ 23: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన వినాయక్‌రెడ్డిని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వినాయక్‌రెడ్డికి కార్పొరేటర్ పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పృథ్వీరాజ్ ఉన్నారు.

యువతిపై హత్యాయత్నం

సిర్గాపూర్, నవంబర్ 23: యువతిపై ఓ ఆగంతకుడు పెట్రోల్ పోసి హత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని వాసర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హన్మంతరావు, మీనాబాయి కూతురు స్నేహలత ఇంట్లో ఒంటరిగా ఉండగా శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి మాస్క్ వేసుకొని ఇంట్లో చొరబడి స్నేహలతపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. బయటకు వెళ్లి గడియ వేసి వెళ్లాడు. మంటలకు తాళలేక అరవడంతో స్థానికులు ఆమెను మంటల నుంచి కాపాడారు. వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాదాపు 60 శాతం మంటల్లో కాలిన ఆమె పరిస్థితి విషమించడంతో వెల్‌నెస్ హైదరాబాద్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అదనపు ఎస్పీ సంజీవ రావు, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బొల్లారం విద్యార్థులు

బొల్లారం, నవంబర్ 23: రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు బొల్లారం మున్సిపాలిటీ విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో బొల్లారం జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు గౌతమ్, గౌతమ్‌కృష్ణ వ్యర్థ నీటి శుద్ధికరణ ప్రాజెక్టు తయారుచేసి ప్రథమ బహుమతి సాధించారు. జిల్లాలోని సేయింట్ ఆంథోనీ హైస్కూల్‌లో జరిగిన సైన్స్ ఫెయిర్ 2024 పోటీల్లో వ్యర్థ నీటి శుద్ధికరణ ప్రాజెక్టు తయారు చేసి ప్రతిభ చాటిన విద్యార్థులు గౌతమ్, గౌతమ్‌కృష్ణను ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు చేతులమీదుగా విద్యార్థులకు అవార్డుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సతీశ్‌కుమార్, కోఫౌండర్స్ స్మిత భోగరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ నాగమణి అభినందించారు.

బొల్లారం: గౌతమ్‌కు అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, డీఈవో వెంకటేశ్వర్లు

జిల్లాస్థాయిలో గుమ్మడిదల విద్యార్థులు

గుమ్మడిదల, నవంబర్ 23: జిల్లాస్థాయి బాలవైజ్ఞానిక ప్రదర్శనలో జడ్పీహెచ్‌ఎస్ గుమ్మడిదల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిని రాష్ట్ర స్థాయి బాలవైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేశారు. శనివారం సంగారెడ్డిలోని సేయింట్ ఆంథోనీస్ హైస్కూల్ శాంతి నగర్‌లో జరిగిన జిల్లా స్థాయి బాలవైజ్ఞానిక ప్రదర్శనలో స్మార్ట్ హెలిమెంట్‌ను తేజస్విని, మహేశ్వరి ప్రదర్శించారు. దీనిని ఉత్తమ ప్రదర్శనగా ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. ఇన్‌స్పైయిర్‌లో సంజీవని హెలిక్యాప్టర్‌ను ఉత్తమ ఇన్‌స్పైయిర్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిని హెచ్‌ఎం సబ్బలక్ష్మితో పాటు గౌడ్ శోభారాణిని అభినందించారు.

పంచాయతీ కార్యదర్శి కుటుంబాన్ని ఆదుకోవాలి

హత్నూర, నవంబర్ 23: పంచాయతీ కార్యదర్శి రమేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల మహేశ్ డిమాండ్‌చేశారు. శనివారం హత్నూరలో విలేకరులతో మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శి రమేశ్‌ను మావోయిస్టులు ఇన్‌ఫార్మర్‌పేరుతో హత్యచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హత్యకు గురైన పంచాయతీ కార్యదర్శి కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఇవ్వడంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు పోలీసులతో రక్షణ కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు నవీన్, నీరజ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 23: జిల్లాలోని దివ్యాంగులు, దివ్యాంగుల సంక్షేమం కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి శనివారం ప్రకటనలో తెలిపారు. నిర్ణీత దరఖాస్తుతో పాటు బయో డేటా వివరాలు, సంబంధిత డాక్యుమెంట్లు, సాధించిన విజయాల సంగ్రహంతో ఈ నెల 27లోగా కలెక్టరేట్‌లోని జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. దరఖాస్తు ఫా రం, మరిన్ని వివరాల కోసం www.wdsc.telanagana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

క్షేత్ర పర్యటనలో 'తారా' విద్యార్థులు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 23: అంతర్జాతీయ వారసత్వ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక తారా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మండల పరిధిలోని కలబ్‌గూర్ గ్రామాన్ని సందర్శించారు. కళాశాల చరిత్ర విభాగం, యువ టూరిజం క్లబ్, సామాజిక శాస్త్ర విభాగాలు, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో క్షేత్ర పర్యటనలో భాగంగా కలబ్‌గూర్ శివాలయం, మంజీరా డ్యామ్‌లను విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ రత్నప్రసాద్ మాట్లాడుతూ దేశాన్ని ఏ రాజవంశీయులు పరిపాలించినా దేశ వారసత్వ సంపద, అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జోత్స్న, టూరిజం క్లబ్ కన్వీనర్ డాక్టర్ సదయ్య కుమార్, చరిత్ర విభాగధిపతి డాక్టర్ వాణి, అర్థ శాస్త్ర విభాగధిపతి డాక్టర్ అనురాధ అధ్యాపకులు పాల్గొన్నారు.

నూతన సీఐకి సన్మానం

సీఐ రవీందర్ రెడ్డిని సన్మానిస్తున్న గుండ్ల మహేందర్ రెడ్డి, తదితరులు

బొల్లారం, నవంబర్ 23: ఐడీఏ బొల్లారం సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీందర్ రెడ్డిని శనివారం మున్సిపల్ సీనియర్ నాయకుడు గుండ్ల మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో యువ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. పారిశ్రామికవాడలో లాండ్ అండ్ ఆర్డర్ పరిరక్షణకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రూపేశ్, సందీప్ రెడ్డి, జాకీర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అటవీ భూముల్లో వేసిన షెడ్లను తొలగిస్తాం

హత్నూర, నవంబర్ 23: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అటవీ భూమిలో అక్రమంగా వేసిన రేకుల షెడ్లను తొలగిస్తామని ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ షాహినీతరుణ్ణం తెలిపారు. శనివారం మండలంలోని శేర్కాన్‌పల్లి శివారులోని పలుగుపోచమ్మ ఆలయ సమీపంలో అటవీ భూమిలో కొందరు అక్రమంగా ఏర్పాటు చేస్తున్న రేకుల షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్లు వేసిన కొందరికి వాటిని తొలగించాలని నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ రేకులషెడ్లను తొలగించకపోగా మరిన్ని షెడ్లను కొత్తగా ఏర్పాటు చేస్తుండటంతో పరిశీలించామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికితీసుకుపోయి త్వరలోనే వాటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మునిపల్లి, నవంబర్ 23: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్ప గాయాలైన ఘటన కంకోల్ శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేశ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణం ఆదర్శనగర్‌కు చెందిన పట్లోళ్ల శ్రీనివాస్ రెడ్డి(40) అదే పట్టణానికి చెందిన నగిరే ప్రశాంత్ బైక్‌పై జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్నారు. మార్గమధ్యలో మునిపల్లి మండలం కంకోల్ శివారులోని వొక్సాన్ యూనివర్సిటీ వద్దకు రాగానే వెనుక నుంచి ఇన్నోవా కారు బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న శ్రీనివాస్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రశాంత్‌ను దవాఖానకు తరలించారు. మృతుడు శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భగీరథ కార్మికులతో చర్చలు విఫలం

ఫిల్టర్ బెడ్‌ను సందర్శించిన జిల్లా అధికారులు

ఆందోళన చేస్తున్న మిషన్ భగీరథ తాత్కాలిక కార్మికులు

జహీరాబాద్, నవంబర్ 23: న్యాల్‌కల్ మండలంలోని రాఘవాపూర్ మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌ను శనివారం మిషన్ భగీరథ జిల్లా అధికారులు, కాంట్రాక్టర్ సందర్శించారు. న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్ మండలాలకు తాగునీటి సరఫరా నిలిపివేయడంతో తాత్కాలిక కార్మికులతో అధికారులు వేతనాల చెల్లింపుపై చర్చలు జరిపారు. ఈ నెల 26వ తేదీలోగా వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఎస్సీ రఘువీర్, ఈఈ విజయలక్ష్మి, కాంట్రాక్టర్ మస్తాన్‌రెడ్డి అన్నారు. తమకు ఏడు నెలల వేతనాలతోపాటు పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.18 వేలు, ఇతర సౌకర్యాలను కల్పిస్తేనే తాగునీటిని సరఫరా చేస్తామని కార్మికులు తేచ్చిచెప్పడంతో అధికారులు సరైన సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. సంబంధిత అధికారులు, కార్మికుల మధ్య చర్చలు విఫలం కావడతో కార్మికులు ఆందోళనను యధావిధిగా కొనసాగించారు.

డేటా ఎంట్రీలో తప్పులు జరగొద్దు

బొల్లారం, నవంబర్ 23: సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు అన్నారు. శనివారం మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన డేటా ఎంట్రీ ప్రక్రియను మాస్టర్ ట్రైనర్ మహేందర్‌తో కలిసి ప్రారంభించారు. మొత్తం 12 సిస్టమ్స్, 12 మంది సూపర్వైజర్లు, 12 మంది ఆపరేటర్లతో ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో ఆర్వో నర్సింహులు, మేనేజర్ మల్లికార్జున్, సూపర్వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పాఠశాలలో పారిశుధ్య పనులు

బొల్లారం మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. కమిషనర్ మంగ తాయారు ఆదేశాల మేరకు.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన కలుపు, పిచ్చి మొక్కలను తొలిగించారు. తరగతి గదులను శుభ్రపరిచారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

రాయికోడ్, నవంబర్ 23: పోలీసులు అకింతభావంతో విధులు నిర్వర్తించాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రాయికోడ్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులు చూసి కేసుల వివరాలు, పోలీస్‌ల పనితీరు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సీఐ హనుమంతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్న ఎస్ఐ నారాయణ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 23: జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి చేసిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, అనుముల రాంచందర్ శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా నియమించడం ద్వారా వారు పాఠశాలకు 20 రోజులుగా వారు పాఠశాలలకు దూరం అయ్యారని గుర్తు చేశారు. దీంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్య కుంటుపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు అప్పగించిన సర్వే పనులు పూర్తయినందున వెంటనే వారిని పాఠశాలలకు పంపించాలన్నారు. అయితే పాఠశాలలను గాలికి వదిలేసి ఉపాధ్యాయులను డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్ద కూర్చోబెట్టి వివరాల నమోదు చేయాలని ఎంపీడీవోకు హుకూం జారీ చేయడం విచిత్రంగా ఉన్నదన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యపై అధికారులకు ఉన్న నిర్లక్ష్య ధోరణిని వ్యతిరేకిస్తున్నామని వారు స్పష్టం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నారాయణఖేడ్, నవంబర్ 23: నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త సర్దార్ నాయక్ తల్లి మృతి చెందిన నేపథ్యంలో శనివారం మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, సర్దార్‌నాయక్‌ను కలిసి పరామర్శించారు. ఇందులో భాగంగా తన తల్లి మృతికి గల కారణాలను సర్దార్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆయనను ఓదార్చి ధైర్యం చెప్పారు. సర్దార్‌నాయక్ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రాంసింగ్‌నాయక్, జానకీరామ్, బన్సీలాల్, సంక్షిత్, నర్సింగ్, పుండ్లిక్ ఉన్నారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కేంద్ర అధికారుల పర్యటన

పటాన్‌చెరు: నందిగామలో అధికారులకు బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పటాన్‌చెరు, నవంబర్ 23: మండలంలోని నందిగామలో శనివారం ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్, ఐపీవోఎస్ ట్రైనీ అధికారులతో కూడిన బృందం పర్యటించింది. ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరిశంకర్‌గౌడ్, నాయకులు బోనాలతో స్వాగతం పలికారు. శిక్షణ అధికారులు ఐపీవోఎస్ పాల్వే వికాస్ బాలాసాహెబ్, ఐఎఫ్‌వోఎస్ చేతన్ కుమార్ బీవీ, ఐఎఫ్‌ఎస్ స్వాతి సందీప్, ఐపీఎస్ రేపల్లి వసంత్‌కుమార్, ఐఎస్‌ఎస్ స్వాతి గుప్తలతో కూడిన బృందం గ్రామంలో ఐదు రోజులు పర్యటించనున్నారు. గ్రామ పరిపాలన వ్యవస్థ, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన, నిధుల రాక, అంగన్‌వాడీ సేవలు, మహిళా సంఘాల పనితీరు, ఇతర స్కీంలు, ఖర్చు, ప్రజల స్థితిగతులు చూస్తారు. కార్యక్రమంలో కార్యదర్శి రాజేందర్, ఎంపీఎం శ్రీనివాస్, ఏపీడీ, ఏవో శివకుమార్, ఏఈవో చందర్, గ్రామ నాయకులు గోపాల్, శివానందం, గోల్కొండ లక్ష్మణ్, డాక్టర్ స్వాతి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కొడకంచిలో కేంద్ర బృందం పర్యటన

జిన్నారం, నవంబర్ 23: జిన్నారం మండలం కొడకంచి గ్రామంలో కేంద్ర అధికారుల బృందం పర్యటించింది. శుభం కండేల్వాల్ ఐపీఎస్, వేదాంత్‌శంకర్ ఐపీఎస్, రాహుల్‌యాదవ్ ఐపీఎస్, నీరజ్ నిశ్చల్ ఐఎఫ్‌ఎస్‌ల బృందం గ్రామీణ ప్రజల జీవన శైలిని తెలుసుకునేందుకు వచ్చారు. గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఒక వీధిలో పర్యటించారు. కొడకంచి ఆదినారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. నాలుగు రోజుల పాటు గ్రామంలోనే ఉండి పరిశీలించనున్నారు. ఎంపీవో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వర్, మాజీ సర్పంచ్ చెట్టి శివరాజ్, లక్ష్మణ్‌రావు, వీరేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నారంలో..

గుమ్మడిదల, నవంబర్ 23: గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామంలో కేంద్ర అధికారుల బృందం పర్యటించింది. అధికారులు ఆకాంక్ష మిలింద్ ఐపీఎస్, అశికుమార్ ఐపీఎస్, రమేశ్‌కుమార్ ఐఎఫ్‌ఎస్, అధితి ఝా ఐఎఫ్‌ఎస్, డెబ్దత్ సాహా ఐఎస్‌ఎస్ అధికా రుల బృందం ఐదు రోజుల పాటు గ్రామంలో ప్రజల జీవన విధానాన్ని పరిశీలించనున్నారు.

రికార్డుల పరిశీలన

ఝరాసంగం, నవంబర్ 23: నిమ్జ్‌కు సంబంధించి భూసేకరణపై గ్రామాల వారీగా వివరాలివ్వాలని, ఎల్గోయి గ్రామ శివారులోని సర్వే నంబర్ 54లో ఏం జరిగిందని అదనపు కలెక్టర్ మాధురి తహసీల్దార్ తిరుమలరావును అడిగి తెలుసుకున్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులు, నూతనంగ ఏర్పాటు చేసిన కంప్యూటర్లను, రికార్డు గదిని పరిశీలించారు. నాయబ్ తహసీల్దార్ యాసిన్, ఆర్ఐ రామారావు, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త

నాగల్‌గిద్ద, నవంబర్ 23: డిజిటల్ లావాదేవీల పేరిగిన నేపథ్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సాయిలు అన్నారు. శనివారం మండలంలోని ఎస్టీ బాలికల గిరిజన గురుకులంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ ఇంద్రజ, ఎంపీడీవో మహేశ్వర్‌రావు, స్పెషల్ ఆఫీసర్ బలరాంనాయక్, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

అందోల్, నవంబర్ 23: అందోల్-జోగిపేట పరిధిలోని 11, 16, 2, 3 నంబర్ల అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం జిల్లా సంక్షేమశాఖ అధికారి లలిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్లలో అందుతున్న పౌష్టికాహారం, ఇతర సేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో సీడీపీవో ప్రియాంక, సూపర్‌వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

సదాశివపేట, నవంబర్ 23: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గాంధీచౌక్, శ్రీకృష్ణనగర్ కాలనీ, ఆరో వార్డు, కబరస్తాన్ కాలనీలో ప్రజల సౌకర్యార్థం హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్, కౌన్సిలర్లు సాతాని శ్రీశైలం, ఇంద్ర మోహన్‌గౌడ్, ఆకుల శివ, ప్రకాశ్, శ్రీనివాస్, నాయకులు మోబిన్, నాగుల విజయ్‌కుమార్, ఖాజా, బరాడి శివ, ఆంజనేయులు, నాగరాజు, నాసర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

పుల్కల్, నవంబర్ 23: విద్యార్థులకు చదువుతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గది, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్ఓ ఇందిర, ఉపాధ్యాయులున్నారు.

గంజాయి సాగు చేసిన వ్యక్తికి ఐదేండ్ల జైలు

మునిపల్లి, నవంబర్ 23: గంజాయి పండించిన వ్యక్తికి ఐదేండ్ల జైలు శిక్షతో పాటు రూ.25 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ న్యాయమూర్తి శ్రీమతి జయంతి తీర్పు వెలువరించినట్లు ఎక్సైజ్ సీఐ నాజీర్‌పాషా తెలిపారు. 2018లో మండలంలోని పెద్దలోని గ్రామానికి చెందిన మంగలి వెంకటేశం గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో అప్పటి ఎక్సైజ్ సీఐ మధుబాబు సిబ్బందితో కలిసి పంటపై దాడి చేసి 36 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం వెంకటేశానికి ఐదేండ్ల జైలుతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు.

ఐఐటీహెచ్‌లో హాఫ్ మారథన్

కంది, నవంబర్ 23: ఐఐటీ హైదరాబాద్‌లో డిసెంబర్ 1న రన్నర్స్ క్లబ్ హాఫ్ మారథన్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐఐటీ హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. శనివారం ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు రేస్ బిబ్‌లను ఆవిష్కరించారు. 5కే, 10కే ఫన్ రన్‌లో పాల్గొనేందుకు 1,300 మంది సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. బీటెక్ విద్యార్థి మృతి

అమీన్‌పూర్, నవంబర్ 23: కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ప్రగతినగర్‌కు చెందిన వీర్ల బాలమహేంద్ర(19) బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడైన కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం మేడూరుకు చెందిన సృజన్‌కుమార్(19)తో కలిసి బైక్‌పై పటాన్‌చెరు నుంచి గండిమైసమ్మ వైపునకు కాలేజీకి వెళ్తున్నారు. సుల్తాన్‌పూర్ శివారులోని ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నంబర్ 4 వద్దకు రాగానే ఓఆర్‌ఆర్ సర్వీసు రోడ్డులో బొల్లారం నుంచి అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బాలమహేంద్ర, సృజన్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మదీనాగూడలో ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ బాలమహేంద్ర మృతిచెందాడు. మృతుడి పెద్దనాన్న వీర్ల మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు తెలిపారు.